క్లుప్తంగా

దరఖాస్తులు ఆహ్వానం

కాశీబుగ్గ: పారాలీగల్ వాలంటీర్ల నియమానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల న్యాయాధికారి సంస్థ చైర్మన్, పలాస జూనియర్ సివి ల్ జడ్జి యు.మాధురి తెలియజేశారు. రాష్ట్ర న్యాయసేవ అధికారి సంస్థ, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు పారాలీగల్ వాలంటీర్లుగా నియమానికి దరఖాస్తులు ఆహ్వానించడమైనది తెలియజేశారు. 10వ తరగతి పాస్ అయ్యుండి, 18 సంవత్సరాలు పూర్తైనవారు, ఎటువంటి సివిల్ క్రిమినల్ కేసు ల్లో లేనివారు అర్హులు అన్నారు. ఈ నియామకంలో పదవీ విరమణ చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు, ప్రైవేటు ఉద్యోగులు అదేవిధంగా ట్రాన్స్‌జెండర్లు సైతం అర్హులని పేర్కొన్నారు. ఒక పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్ జిరాక్స్‌తో పలాస కోర్టు ఆవరణంలో దరఖాస్తు చేసుకోవాలని న్యాయమూర్తి తెలియజేశారు.

సాయి సేవలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయ



పూజల్లో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

సోంపేట: సత్య సాయిబాబా సేవలో గురువారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ పాల్గొన్నారు. భగవాన్ సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా సత్యసాయి ప్రేమ వాహిని రథోత్సవం గురువారం రాత్రి సోంపేట చేరుకుంది. ఈ సందర్భంగా సత్యసాయి చిత్రపటానికి పిరియా విజయ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెతో పాటు సుంకిడి ఎంపీటీసీ నిమ్మన లీలారాణి, సత్యసాయి సేవా సమితి సభ్యులు ఉన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

వజ్రపుకొత్తూరు రూరల్: మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని వజ్రపుకొత్తూరులో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఎంపీడీవో రమేష్‌నాయుడు, తహసీల్దార్ సీతారామయ్య, ఉప తహసీల్దార్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఎమ్మెల్యే గౌతు శిరీష చేతులమీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీ ట్రేడ్ చైర్మన్ వజ్జ బాబూరావు, బీసీ సెల్ నాయకులు లొడగల కామేశ్వరరావు, కాష్యూ లేబర్ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మెప్మా వ్యాపారాలు పరిశీలన

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో మెప్మా రుణాలతో ఏర్పాటు చేసిన వ్యాపారాలను మెప్మా పీడీ ఎస్వీ రమణ గురువారం పరిశీలించారు. మెప్మా ఆధ్వర్యంలో ఏవిధమైన రుణాలు కావాలన్నా మెప్మా విభాగానికి వెళ్లి నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కొత్తగా వ్యాపారం పెట్టాలంటే మెప్మాను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం పిన్నింటి మోహనరావు, ఆర్‌పీ పుణ్యావతి, డీఈవో బోర విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిరావుకు సత్కారం

కంచిలి: మండలంలోని జలంత్రకోట పంచాయతీ చొట్రాయిపురం గ్రామ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం, గణిత అవధాని మద్దు తిరుపతిరావు తయారు చేసిన గణిత ప్రాజెక్టు జాతీయ స్థాయిలో ఎంపిక కావడంతో పాఠశాల ఆవరణలో స్థానిక సర్పంచ్ డొక్కరి బ్రహ్మానందం అధ్యక్షతన గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పూర్వాపరాలను అవధాని తిరుపతిరావు స్థానికులకు వివరించారు. కార్యక్రమంలో సంజయ్‌కుమార్ పండా, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

కళింగ సేవా సమితి సమావేశం నేడు

సోంపేట: పట్టణంలోని కళింగ సేవా సమితి సమావేశాన్ని శుక్రవారం సాయంత్రం న్యాయవాది చలపతిరావు కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్నట్లు ప్రస్తుత గౌరవ అధ్యక్షుడు, అధ్యక్షుడు పండి కృష్ణారావు, తమ్మినేని శేషయ్యలు గురువారం తెలిపారు. కార్యాచరణ ప్రణాళిక నిర్వహించేందుకు సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే నూతన కార్యవర్గం ఎన్నుకోనున్నట్లు వెల్లడించారు.

నవధాన్యాల సాగు..
భూమికి బాగు



నవధాన్యాల కిట్లు అందజేత

- రసాయనిక ఎరువులతో తగ్గుతున్న భూసారం
- నవధాన్యాల సాగుతో మేలు
- తగ్గనున్న పెట్టుబడులు

సోంపేట:

మన పూర్వీకులు సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేసేవారు. దీంతో ఆరోగ్యకరమైన పంటలు పండేవి. అలాగే భూసారం పెరిగేది. అయితే పెరుగుతున్న జనాభా దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వాలు అధిక దిగుబడులు కోసం రైతులకు రసాయనిక ఎరువులు వాడాలని సూచించాయి. దీంతో రైతులు రసాయన ఎరువులపై మక్కువ చూపి, సేంద్రియ ఎరువులు మరిచి పోయారు. ఫలితంగా ప్రస్తుతం భూములు చౌడు బారి దిగుబడులు లేక, చీడపీడలతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఈ తరుణంలో నవధాన్యాల సాగుతో మళ్లీ భూమిలో సారం పెరగడంతో పాటు, చీడపీడలు తగ్గి పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయాధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సూచిస్తున్నారు.

నవధాన్యాల సాగు ఇలా...

పంట కాలానికి సంబంధం లేకుండా ప్రధాన పంటకు ముందు 20 నుంచి 30 రకాల వివిధ రకాల పంటల విత్తనాలు కలిపి వెదజల్లి, సాగుభూమిని సజీవ వేరు వ్యవస్థతో ఎల్లప్పుడూ కప్పి ఉంచేలా చర్యలు తీసుకోవాలి. ఈ ప్రక్రియ 365 రోజులు భూమి పంటలతో కప్పి ఉండాలనే వ్యూహంలో ముఖ్య భూమిక పోషిస్తుంది. ఈ విధానాన్ని నవధాన్యాల సాగు విధానం అంటారు. దీనిపై రైతులకు వ్యవసాయాధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు.

నవధాన్యాల సాగులో పంట విత్తనాలు

పచ్చిరొట్ట పైర్లు	జీలుగ, జనుము, పిల్లిపెసర
పప్పు ధాన్యాలు	మినుము, పెసర, ఉలవ, బొబ్బర్లు
నూనె గింజలు	వేరుశనగ, నువ్వులు, ఆముదం
చిరుధాన్యాలు	జొన్న, కొర్రలు, రాగులు
ఆకుకూరలు	ముల్లంగి, తోటకూర, గోంగూర, పాలకూర
తీగజాతి విత్తనాలు	బీర, ఆనప, దోస

కలిగే ప్రయోజనాలు

నవధాన్యాల సాగు 365 రోజులు భూమిని కప్పి ఉంచే నిరంతర సాగు ప్రక్రియకు శ్రీకారం చుడుతుంది. వివిధ పంటల వేర్లు భూమిలో వైవిధ్య రకాల సూక్ష్మజీవులకు ఆశ్రయం కల్పించి పంటలకు ఉపయోగపడే సూక్ష్మజీవుల సంతతిని అభివృద్ధి చేస్తాయి. ప్రధాన పంటకు కావాల్సిన స్థూల, సూక్ష్మ పోషకాలు అందుబాటులోకి తీసుకొచ్చి మొక్కల వేరు వ్యవస్థను గ్రహించేటట్లు చేస్తాయి. పశువులకు పోషక విలువతో కూడిన పచ్చిమేతగా ఉపయోగపడుతుంది. నేల గుల్లబారి వానపాములు అభివృద్ధి చెందుతాయి. నేలలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. నేల కోతకు గురికాకుండా సేంద్రియ కర్బన శాతం పెరుగుతుంది. ప్రధాన పంటల్లో రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుంది. పంటల్లో చీడపీడలు, తెగుళ్ల తట్టుకునే సామర్థ్యం పెరుగుతుంది. దీంతో రైతులకు కొంత పెట్టుబడి తగ్గుతుంది. నవధాన్యాల సాగుకు రైతులు ఆసక్తి చూపాలని వ్యవసాయాధికారులు తెలియజేస్తున్నారు.

సాగుతో భూసారం వృద్ధి



నవధాన్యాల సాగుతో భూసారం వృద్ధి చెందుతుంది. వరి పొలాలతో పాటు, కొబ్బరి, జీడితోటల్లో చల్లుకుంటే దిగుబడులు పెరుగుతాయి. భూసారాన్ని పెంచుకుని ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందజేయాలి. నవధాన్యాల సాగుకు రైతులు ముందుకురావాలి.

– బి.నర్సింహమూర్తి, వ్యవసాయాధికారి, సోంపేట



నవధాన్యాల విత్తనాల ప్రదర్శన

ప్రస్తుతం రైతులు అనుసరిస్తున్న వ్యవసాయ సాగు విధానంలో సేంద్రియం లేకుండా దుక్కిదున్ని, రసాయన ఎరువులు వాడి, పంటలు పండించడం వలన భూమిలో కర్బన శాతం తగ్గుతోంది. అయితే నవధాన్యాల సాగుతో భూమిలో కర్బన శాతం పెరిగి పంటకు కావాల్సిన అన్నిరకాల పోషకాలు అందుతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

అభివృద్ధి పనుల్లో సమన్వయం కీలకం



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి

కవిటి: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో రాబోయే రోజుల్లో మైనర్ ఇరిగేషన్ అభివృద్ధి పనుల నిర్వహణకు అన్నిశాఖల సమన్వయంతో ముందుకు సాగుదామని ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం కవిటి మండల పరిషత్ కార్యాలయంలో తన అధ్యక్షతన వ్యవసాయ, ఉద్యాన, ఉపాధి హామీ, ఇరిగేషన్, అటవీశాఖ అధికారుల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రధానంగా మండలంలో సూక్ష్మనీటి పారుదల విభాగంలో జల సంరక్షణ కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టడమే లక్ష్యంగా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏవో పి.శ్రీదేవి, హెచ్‌వో పి.మాధవీలత, ఏపీవో టి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు అభివృద్ధి చెందాలి



వర్క్‌షాపులో మాట్లాడుతున్న విప్ అశోక్

కవిటి: తమ వ్యవసాయ ఉత్పత్తులనే మూలధనంగా చేసుకొని ఆదాయం పెంచుకునే విధంగా రైతులు పారిశ్రామిక కోణంలో అభివృద్ధి చెందాలని ప్రభుత్వ విప్ డా.బి.అశోక్ సూచించారు. కవిటిలో కొబ్బరి, ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులకు సీడాప్ సంస్థ ఒక్కరోజు వర్క్‌షాప్ గురువారం నిర్వహించింది. ఈ సందర్భంగా రైతులు తమ ఆలోచనల ద్వారా ఏయే మార్గాల్లో వ్యాపార అభివృద్ధికి ప్రణాళికల్లో ఉన్నారనే విషయంపై చర్చించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంలో మహిళల స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా కుట్టు మిషన్ శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. 90 రోజుల పాటు జరగనున్న శిక్షణలో హాజరు ఖచ్చితంగా ఉండాలన్నారు. హాజరు 75 శాతం కన్నా తగ్గితే ఈ పథకం ప్రయోజనాలు దక్కవని స్పష్టం చేశారు.

ఖరీఫ్ ప్రణాళికపై అవగాహన సదస్సు



నందిగాం: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



కంచిలి: ఆదర్శ రైతులను సన్మానిస్తున్న దృశ్యం

నందిగాం: మండలంలోని రౌతుపురంలో ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై అవగాహన సదస్సును ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు లోకేష్, గోవిందలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతులకు ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను, ప్రయోజనాలను, ఏటీఎం మోడల్, ఏ గ్రేడ్ మోడల్, కిచెన్ గార్డెన్‌ల గురించి వివరించారు. అలాగే ప్రకృతి వ్యవసాయంను గ్రామ రైతులు అందరూ ఒక ఉద్యమంగా చేపట్టాలని గ్రామానికి చెందిన విశ్రాంత ఐపీఎస్ అధికారి వజ్జ గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శంబాన దానయ్య, బొడ్డ జగన్నాథం తదితరు ల పాల్గొన్నారు.

కంచిలి: రానున్న ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసే పంటల కోసం ప్రకృతి వ్యవసాయ విధానం మండల యాంకర్ టి.శివానందం, గోకర్ణపురం యూనిట్ ఇన్‌చార్జి శీర కామరాజులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. మండలంలోని కత్తివరం, బూరగాం గ్రామాల్లో ఈ మేరకు అవగాహన సదస్సులు గురువారం నిర్వహించారు. కత్తివరం గ్రామానికి చెందిన ఆదర్శ రైతులు భావన కృష్ణమూర్తి, పండి రాంప్రసాద్, బూరగాం గ్రామానికి చెందిన కప్ప గోపీనాథ్, మద్దు వెంకటేశ్వరరావులను సన్మానించారు. కార్యక్రమాల్లో ఐసీఆర్పీలు ఢిల్లెమ్మ, ప్రమీల, నాగమణి, తేజావతి, నారాయణరావు, కల్పన, జి.భవానీ, పుష్ప, రోహిణి, మీన, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తీరప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

వజ్రపుకొత్తూరు రూరల్: ప్రస్తుతం దేశ సరిహద్దుల్లో నెలకున్న పరిస్థితుల నేపథ్యంలో తీరప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మైరెన్ ఎస్ఐ వి.శ్రీనివాసరావు సూచించారు. ఈ మేరకు మండలంలోని దేవునల్తాడలో బావనపాడు మెరైన్ సీఐ రాము ఆదేశాల మేరకు గురువారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టాలన్నారు. అనుమానిత వ్యక్తులపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అలాగే మత్స్యకారులకు చొరబాటుదారుల కదిలికలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ పనుల పరిశీలన

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి రోజువారీ శానిటేషన్ పనులను మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు గురువారం పరిశీలన చేశారు. 17వ వార్డు తిలక్‌నగర్ రోడ్డులో స్వీపింగ్, 31వ వార్డు పలాస వాసుదేవపేటలో చెత్త తొలగింపు, 13వ వార్డు ఓల్డ్ బస్టాండ్‌లో గార్బేజ్‌ను తీయించారు. 15వ వార్డు నెహ్రూనగర్‌లో డోర్ టు డోర్ కలెక్షన్ సక్రమంగా జరిగేటట్లు ఆదేశాలిచ్చారు. అనంతరం పలాస 24వ వార్డు ముత్యాలమ్మ కోనేరు ఎదురుగా మేజర్ డ్రైన్‌లో జేసీబీతో పూడికలు తీయించారు.

మెరుగైన సౌకర్యాల కోసం ఉద్యమిద్దాం

కంచిలి: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో మెరుగైన సౌకర్యాల కోసం దళిత సంఘాల సంయుక్త మండలి ఆధ్వర్యంలో ఉద్యమిద్దామని సంఘం నేతలు పిలుపునిచ్చారు. మండల కేంద్రం కంచిలిలోని గురుకుల పాఠశాల ఆవరణలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలను తక్షణమే భర్తీ చేయాలని, ప్రతీ జిల్లాలో బాలుర, బాలికల డిగ్రీ కాలేజీలు రెండు, పారామెడికల్ కోర్సులు రెండు ప్రవేశపెట్టాలని కోరారు. శిథిలావస్థలో ఉన్న భవనాలకు మరమ్మతులు చేయించాలని, భవనాలు కొరత ఉన్నచోట నూతన భవనాలు నిర్మాణాలు చేయాలని, సౌకర్యాలు లేకపోవడం వలన ప్రతీ సంవత్సరం విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో దళిత సంఘాల జేఏసీ నేతలు దుర్గాసి గణేష్, బెలమర ప్రభాకర్, చల్లా రామారావు, మిస్కా కృష్ణయ్య, చింత ప్రకాశరావు, లోకేశ్వరరావు, బడే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ వాహిని రథానికి ఘన స్వాగతం



ఇచ్ఛాపురం రూరల్: కేశుపురంలో రథానికి స్వాగతం పలుకుతున్న భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: భగవాన్ సత్యసాయి శత జయంతి ఉత్సవాలు పురస్కరించుకొని మండలంలోని తిప్పనపుట్టుగ, ఈదుపురం, కేశుపురం, సన్యాసిపుట్టుగ, బూర్జపాడు, డొంకూరు గ్రామాల్లో పర్యటించిన ప్రేమ వాహిని రథానికి సాయి భక్తులు భక్తి శ్రద్ధలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సత్యసాయి జిల్లా సేవా సమితి కన్వీనర్ సూర రామచంద్రరావు మాట్లాడుతూ.. ప్రజల్లో ఆధ్యాత్మికతతో పాటు ప్రేమ తత్వాన్ని నింపేందుకు, బాల వికాస్, సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు భారతదేశంలో ఐదు ప్రేమ వాహిని రథాలు ప్రతీ గ్రామంలో పర్యటిస్తున్నాయన్నారు. ఏప్రిల్ 24న పుటపర్తిలో ప్రారంభించిన ఈ రథాలు కన్యాకుమారి నుంచి కాశ్మీరు వరకు వంద రోజుల పాటు సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక బోధనలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సేవా విభాగం సమన్వయకర్త అనాథగుప్త, కేవీ రమణమూర్తి, లలిత, తంబర్, కాశీ విశ్వవిశ్వేరరావు, చిన్నారావు, బాగ జయపతి, సుధారాణి, చంద్రశేఖర్, ఢిల్లీరావు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మందస: భగవాన్ సత్యసాయి ప్రేమ వాహిని రథం మందసలో గురువారం పర్యటించింది. రథానికి సత్యసాయి భక్తులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థలు జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు, కో–ఆర్డినేటర్ ఎస్.అనాథ గుప్త, పలాస జోనల్ కన్వీనర్ బమ్మిడి బైరాగి తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన విద్యార్థులు



బి.ప్రశాంత్



అవిషా గాంధీ



జె.సుభాషిణి

పలాస: మండలంలోని రామకృష్ణాపురం వద్ద నున్న సత్యసాయి విద్యా విహార్ విద్యార్థిని కొంచాడ అవిషా గాంధీ పాలీసెట్ ఫలితాల్లో సత్తాచాటింది. ఈ పరీక్షలో 119/120 మార్కులతో రాష్ట్రస్థాయిలో 27వ ర్యాంకు సాధించింది. దీంతో విద్యార్థినిని సత్యసాయి విద్యా విహార్ ట్రస్టు అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు అభినందించారు.

మందస: ఏపీఆర్‌జేసీ పరీక్ష ఫలితాల్లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాడ శ్రీజ బైపీసీ విభాగంలో రాష్ట్రస్థాయిలో 55వ ర్యాంక్ సాధించింది. ఇదే పాఠశాలకు చెందిన భాగ్యలక్ష్మి పాణిగ్రాహి కూడా ఎంపీసీ విభాగంలో 496వ ర్యాంక్ సాధించింది. పాలీసెట్‌లో కూడా ఈ విద్యార్థిని 120 మార్కులకు గాను 110 మార్కులు సాధించింది. దీంతో వీరిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.



బాడ శ్రీజ, భాగ్యలక్ష్మిను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సోంపేట: పట్టణానికి చెందిన విద్యార్థులు ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో సత్తాచాటారు. బి.ప్రశాంత్ 124వ ర్యాంకు, జె.సుభాషిణి ఏపీఆర్‌జేసీలో 288వ ర్యాంకు, పాలీసెట్‌లో 190వ ర్యాంకు సాధించింది. దీంతో వీరిని పలువురు అభినందించారు.

విద్యార్థులకు అభినందనలు



వజ్రపుకొత్తూరు రూరల్: విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు



కాశీబుగ్గ: నాన్నమ్మతో కలిసి సత్కారం పొందుతున్న విద్యార్థి బాలకృష్ణ

కాశీబుగ్గ: పలాస మండలం గంగువాడ గ్రామానికి చెందిన పైల బాలకృష్ణ అనే విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని పది ఫలితాల్లో 584 మార్కులు సాధించాడు. తల్లిదండ్రులు హైదరాబాద్‌లో మేస్త్రీ పని చేసుకుంటూ తన నానమ్మ దగ్గర ఉంచి చదివిస్తున్నారు. అత్యధిక మార్కులు సాధించడంతో గంగువాడ గ్రామంలోని నీలకంఠేశ్వర యువజన సేవా సంఘం సభ్యులు, గ్రామస్తులు గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు అసపన్న బాలరాజు, ఉపాధ్యక్షుడు వట్టికూళ్ల ధనుంజయ, ప్రధాన కార్యదర్శి వట్టికూళ్ల రామ్‌కుమార్, సభ్యులు పైల నాగార్జున, అగ్గున్న కృష్ణారావు, అసపన్న లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఏపీఆర్‌జేసీ, పాలీసెట్ ఫలితాల్లో మండలానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఏపీఆర్‌జేసీ బైపీసీ విభాగంలో బుడగట్ల కావ్య 97 మార్కులతో 581 ర్యాంక్ సాధించింది. అలాగే దున్న మేఘన 97 మార్కులతో 601 ర్యాంక్, సైని వైష్ణవి ఎంపీసీ విభాగంలో 107 మార్కులతో 890 ర్యాంక్, గోవిందు నాని 101 మార్కులతో 1255 ర్యాంక్ సాధించారు. దీంతో తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తదితరులు వారిని అభినందించారు. భవిష్యత్‌లో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అకాంక్షించారు. కార్యక్రమంలో గణేష్, కూన మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



బెల్లుపడలో పరామర్శిస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కంచిలి: మండలంలోని మఠం సరియాపల్లి పంచాయతీ పరిధి రాగుపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గేదెల మాదాలు కుటుంబ సభ్యుడు గేదెల ధర్మారావు(24) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అదేవిధంగా బెల్లుపడ గ్రామానికి చెందిన తెంబూరు వనజాక్షి(51) గుండెనొప్పితో మృతి చెందింది. ఈ సమాచారం తెలుసుకున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి ఆయా కుటుంబాలను పార్టీ నేతలతో కలిసి గురువారం పరామర్శించారు. ఆయనతోపాటు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, పార్టీ నేతలు దుర్గాసి ధర్మారావు, లడ్డుకేశవపాత్రో, కొణపల సురేష్, తలగాన తిరుపతిరావు, బెల్లుపడ సర్పంచ్ అయుధం జయరాం, ఎంపీటీసీ సభ్యుడు బుడ్డెపు విశ్వనాథం రెడ్డి, పైల లక్ష్మీనారాయణ ఉన్నారు.

ప్రిన్సిపాల్‌గా సింహాచలం నియామకం



బాధ్యతలు స్వీకరిస్తున్న సింహాచలం

కవిటి: ఏపీ స్టేట్ ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆదేశాల మేరకు కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కె.సింహాచలంనాయుడు గురువారం విధుల్లో చేరారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యాశాఖలో పనిచేస్తున్న 15 మంది జూనియర్ అధ్యాపకులకు ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతి కల్పించింది. దీనిలో భాగంగా విశాఖపట్నం జిల్లా హుకుంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాణిజ్య శాస్త్రంలో జూనియర్ అధ్యాపకులుగా పని చేసిన సింహాచలంనాయుడు ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందారు. ఆయనకు తెలుగు జేఎల్ పేడాడ రాజేశ్వరరావు, జె.పాపారావు, బి.శ్రీనుబాబు, కె.కరుణశ్రీ, డి.రమేష్, బి.అంజన తదితరులు స్వాగతం పలికారు.

దారుణదారులు



సన్యాసిపుట్టుగ రోడ్డు దుస్థితి



వర్షపునీరు నిల్వ అయిన కొళిగాం ఆర్అండ్‌బీ రోడ్డు



ఎం.తోటూరు తారు రోడ్డుపై నీరు

పల్లె పండగ పేరుతో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులు సమూలంగా మార్చేస్తామని కూటమి ప్రభుత్వం చెప్పిన మాటలు నీటిమూటలయ్యాయి. కొన్నిచోట్ల హడావుడి చేసి మధ్యలో వదిలేయడంతో మునుపటి కంటే దారుణంగా తయారవ్వగా, మరికొన్ని ప్రాంతాల్లో కనీసం రహదారుల మరమ్మతులకు చర్యలు తీసుకోలేదు. ఫలితంగా ఆయా రోడ్లపై ప్రయాణించడానికి ప్రజలు నరకయాతన పడుతున్నారు. అలాగే వర్షాలు పడితే రోడ్లపై నీరునిల్వ అవుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

– ఇచ్ఛాపురం రూరల్